# ఉత్తరం

శ్రీ పురాణం సూర్యప్రకాశరావు

ఒక విచిత్రమైన, తప్పించుకోవటానికి వీలుకాని సంకట పరిస్థితులలో చేజేతులా వచ్చి నేను ఇరికించుకున్నాను. కొన్ని గంటల తరబడి నా మెదడూ మనసూ ఆలోచనతోనూ ఆందోళనతోనూ సతమతమయి పోయాయి. 'ఎదుటవారి ఉత్తరాలు చదవకూడదు' అనే ఒక మంచి అలవాటు నేను అలవర్చుకుని వుండి వుంటే ఈనాడు ఈ చిక్కులో పడి వుండేవాడ్ని కాను. కాని ఈ సంఘటన జరిగే వరకూ నా దురలవాటు గురించి నేనంతగా ఆలోచించలేదు.

జరిగింది:

ఉదయం పదిగంటలకు ఆఫీసులో సీటులో కూర్చుని కాగితాలు చూసుకుంటున్నాను. ఇంకా తోటి ఉద్యోగులెవరూ రాలేదు. బంట్రోతులు కిటికీ రెక్కలు తెరచి దుమ్ము దులుపుతున్నారు. చలివేస్తున్న ఉదయపు వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. మధ్య మధ్య నేను కిటికీలోంచి బైటికి చూస్తున్నాను.

దూరంగా పోస్టు బంట్రోతు కనిపించాడు.

జవానుని పిలిచి "నాకేమయినా ఉత్తరాలున్నాయేమో కనుక్కుని తీసుకురా." అన్నాను.

మరునిముషంలో ఒక కవరు చేతబట్టుకుని జవాను తిరిగి వచ్చాడు. నేను ఆత్రంగా చెయ్యి చాపబోతే "మీకేమీ లేవు సార్. ఇది సూరిబాబుగారికి వచ్చింది." అని అతడు ఆ కవరుని పక్క టేబుల్ మీద పేపరు వెయిటు కింద పెట్టి వెళ్ళిపోయాడు.

నేను చప్పున అలవాటుగా ఒక తెలివి తక్కువ పని చేశాను. సూరిబాబుతో నాకున్న అతి సన్నిహితమైన గాఢమైన చనువును పురస్కరించుకొని అనేక మార్లు నేను అతని ఉత్తరాలు చదివాను. కాని ఎన్నడూ ఇలాంటి విషమ సమస్యని సృష్టించుకోవటం జరగలేదు.

"సూరిబాబు గారికి

నమస్కరించి వ్రాయునది. మీతో నాకు పరిచయం లేకపోయినా నా అంతట నేను కల్పించుకుని ఈ ఉత్తరం మీకు రాస్తున్నాను. మీరెవరో నాకు తెలియదు. కాని మీరు ఏ పిల్లనైతే వివాహం చేసుకోబోతున్నారో ఆ పిల్ల నాకు బాగా తెలుసు. మీ వివాహం ఇంకో వారం రోజుల్లో జరగబోతోంది కదూ? అందుకే తొందరగా ఈ ఉత్తరం రాస్తున్నాను. ఇలాంటి విపత్కర సమయాలలో అన్యాయానికి గురయేవారికి అయాచితంగా సహకరించటం నాలాంటి వారి కర్తవ్యం అని నేననుకుంటున్నాను. మీ కుటుంబం గురించి నేను బాగా విచారించాను. మీ గురించి అన్ని సంగతులూ తెలుసుకున్నాను. మీరు నిశ్చయం చేసుకున్న వధువుని గురించే నేను చాలా ఆందోళన చెందుతున్నాను. మీ గౌరవానికీ, సభ్యతకీ ఆ పిల్ల ఎంతమాత్రం తగినది కాదని నేను గట్టిగా చెబుతున్నాను. ఆమెని మీలో కలుపుకున్నారంటే మీ గౌరవ మర్యాదలన్నీ మంటగలిసిపోతాయని కూడా నేను చెప్పగలను. కులాలు ఒకటయినా గుణానికి మీకూ వారి కుటుంబానికీ మధ్య హస్తిమశకాంతరం వుంది. ఆ పిల్ల నీతిలేని పిల్ల. ఆ పిల్లకి చాలామంది ప్రియులు వున్నారు. ఆ విషయం ఆమె తలిదండ్రులకి తెలియక పోలేదు. ఇంతకుముందు ఒకటి రెండు సంబంధాలు ఈ కారణం వల్లనే తప్పిపోయాయి. చివరికి అమాయకుల్ని చేసి మిమ్మల్ని వంచించారు. మీరు వాళ్ళు పన్నిన వలలో పడ్డారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మీ క్షేమం కోరి చెబుతున్నా. ఈ సంబంధం వదులుకోండి. అనేక సందర్భాలలో ఆమె పరపురుషులతో స్వేచ్ఛగా విహరించటం నేను చూశాను. వాళ్ళతో విందులూ, వినోదాలూ చెయ్యటమూ చూశాను. సినిమాల కెళ్ళటం చూశాను. అర్ధరాత్రీ అపరాత్రీ బుజాలు బుజాలు రాసుకుంటూ వాళ్ళతో ఊరు వెలుపల విహరించటమూ చూశా? ఇంకా చాలా చాలా విన్నాను. ఈ విషయం ఊర్లో అందరికీ తెలుసు. మరి మీరెలా మోసపోయారో నాకు అర్థం కావటం లేదు. కులానికీ గుణానికీ కూడా ఉన్నతిలో వున్న మీకు ఇలాంటి సంబంధం ఎంతమాత్రం తగింది కాదని మరొక మారు హెచ్చరిస్తూ, ఉన్న విషయం మీకు తెలియచేసి నా కర్తవ్యం నేను నెరవేర్చుకున్నాననే సంతృప్తితో ఈ ఉత్తరం ముగిస్తున్నాను.

మీ హితాభిలాషి."

ఉత్తరం పూర్తయేసరికి నాకు ముచ్చెమటలు పోసేశాయి. జవాను వచ్చి పంకా తిప్పిపోయాడు. ఆఫీసులోని గుమాస్తాలు ఒక్కొక్కరే వస్తున్నారు. ఈ ఉత్తరం నేను ఎందుకు చింపినట్టు! ఇప్పుడేం

చెయ్యాలి? వరసగా ప్రశ్నలమీద ప్రశ్నలు ఉద్భవించాయి నాలో.

ఈ ఉత్తరం అతనికిస్తే?

గోప్యంగా ఉంచవలసిన ఇలాంటి కుటుంబ విషయాలు నాలాంటి పరాయివాళ్ళకి - ఎంత పరిచయం ఉన్నప్పటికీ తెలిసిపోవటం అవతలి వాళ్ళకి బాధగా ఉండదూ? నా ద్వారా ఈ విషయం బయటికి పొక్కదని నమ్మటానికి నామీద అతనికెంత విశ్వాసం వుండాలి? తల్లి తండ్రి తనూ — ఈ ముగ్గురు మాత్రమే దాగివుంచవలసిన ఇలాంటి విషయాలు నాలాంటి వాళ్ళు ఇలాంటి తప్పుడుపనులు చేసి తెలుసుకోవటం అవతలి వాళ్ళకి కోపం తెప్పించదూ? వారం రోజుల్లో వివాహం జరగబోతోందనే ఉత్సాహంలో అతను ఈ మధ్య నాలుగైదు రోజుల్నుంచీ ఆ కబుర్లతోనే ఆ వూహలతోనే మమ్మల్నందర్నీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. ఖరీదైన బట్టలు కుట్టించాడు. వివాహ ప్రయత్నాలు జోరుగా జరిగిపోతున్నాయి. తల్లీ, తండ్రీ కోడలు రాకని అపేక్షిస్తూ సంబరపడుతున్నారు. ఆ తండ్రి రోజూ ఆఫీసుకు వస్తూ పోతూ వుంటాడు. ఒక్కగానొక్క కొడుకుమీద ఆయనకు వల్లమాలిన అభిమానం. ఆ అజ్ఞాతవ్యక్తి ఉత్తరంలో రాసినట్టుగానే సూరిబాబు కుటుంబం మంచి ఆదర్శప్రాయమైంది. ఆ విషయం నాకు బాగా తెలుసు. ఇంత ఉత్సాహపూరితమైన వాతావరణం ఈ ఉత్తరం అతనికి అందివ్వటంతో ఎలా మారిపోతుంది? ఆ అమ్మాయి గురించి ఇంత చెడుగా కాకపోయినా ఏ కొద్ది తెలిసినా ఈ సంబంధం ఎలా నిశ్చయం చేసుకుంటారు? ఇదంతా అబద్ధం అని తోసిపారెయ్యటానికి వీలు వుందా? ఒక వేళ నిజం కాదని రుజువైనా ఒక అసహ్యకరమైన వ్యధాపూరితమైన వాతావరణం ఆనూత్న దంపతుల హృదయాలలో అలుముకుని వారి దాంపత్యపు తొలిరోజుల మాధుర్యమంతా ఒకరిమీద ఒకరికి నమ్మకంలేని పరిస్థితుల్లో విషప్రాయంగా మారిపోదా?-ఇలా కొద్దిసేపు ఆలోచించాను.

"అసలు ఈ ఉత్తరం ఆయనకివ్వకుండా ఉంటే?"

"అది కుదరదు!" అనిపించింది. ఒక వేళ ఆ అజ్ఞాతవ్యక్తి రాసిందంతా నిజం అయితే? కాకూడదనే కోరుకుంటాం. కాని కాదని యెలా త్రోసి పారెయ్యగలం? అదే నిజమయితే అలాంటి పిల్లతో కాపరంచేసి జీవితమంతా నరక సదృశం చేసుకుంటూ సూరిబాబు కుటుంబాలో తల్లి తండ్రులు కూడబెట్టిన పరువుప్రతిష్ఠలు తన తరంలో మంటగలిపేసుకుని జీవించగలడా? అలాంటి పరిణామాలకి తను బాధ్యుడు కాడా? సూరిబాబుకి తను ద్రోహం చేసినట్టు కాదా?

ఇలా విరుద్ధమైన ఆలోచనలకి నా మెదడు అలవాలమైపోయింది. కవరుని అరపులో పెట్టుకుందుకు కుర్చీలోంచి లేచి ముందు తోటలోకి పోయి కూర్చున్నాను. ఇంకో అరగంటలో సూరిబాబు ఆఫీసుకు వస్తాడు. ఈ వ్యవధిలో తను ఏవిషయమూ తేల్చుకోవలసి వుంది.

నాకు నామీదే చాలా కోపమూ అసహ్యమూ కలిగాయి

ఇంకొకరి ఉత్తరం తను ఎందుకు చదవాలి? నాకున్న ఈ దురలవాటుని మానుకోమని రెండు మూడు సందర్భాలలో గట్టి హెచ్చరికలే వచ్చాయి. అయినా నేనెప్పుడూ లక్ష్యపెట్టలేదు. కంట కనబడ్డ ఉత్తరాల్లా ఆద్యంతం చదవందే వదిలేవాణ్ణి కాను. ఏమిటో అర్థంలేని సంతృప్తి! ఈ ఉత్తరం తను చదివి వుండకపోతే ఈ సమస్యతో తనకి నిమిత్తం వుండేది కాదు. నాకు నేనుగా ఇందులో ఒక పాత్రనయ్యాను. ఇప్పుడీ వుత్తరాన్ని అతనికిచ్చినా ఇవ్వకపోయినా అతన్ని గాయపరిచినవాడినే అయిపోతాను. నేలది తీసి నెత్తిన పెట్టుకున్నట్టయింది నాపని.

అతన్ని గురించి నన్ను గురించి కూడా బాధపడే విచిత్ర పరిస్థితులు నన్ను చుట్టుముట్టాయి. నా సంకెళ్ళని నేను తయారుచేసుకున్నాను. నేను కేవలం నన్నుగురించే బాధపడటం లేదు. అతనిమీద నాకు అపారమైన సానుభూతి వుంది. ఈ సమస్యని అతనెలా పరిష్కరించుకుంటాడో అనే ఆందోళన నాకు లేకపోలేదు.

పచ్చగడ్డిమీద అటూ ఇటూ పచార్లు చేస్తున్నాను. కిటికీలోంచి ఆఫీసుగడియారం పదకొండు గంటలు చూపెడుతూంది. ఉద్యోగస్తులు చాలామంది కుర్చీల్లో కూర్చుని కాగితాలు సర్దుకుంటున్నారు. పంకాలు 'గీ' పెడుతూ తిరుగుతున్నాయి.

మనసులో ఈ ఉత్తరంలోని విషయాలు నిజం కాకూడదనే కోరుకున్నాను. పర్వలేనివాళ్ళు ఇలాంటి ఉత్తరాలతో పీటలమీద పెళ్ళిళ్ళు చెడగొట్టిన సందర్భాలు నాకు తెలుసు. ఇలాంటి ఉత్తరాలసంగతి అందరికీ తెలుసు. కాని ఎవరూ చూసి చూసి తోసిపారెయ్యలేరు. జీవితంతో చెలగాటాలాడటానికి ఎవరికి మటుకు భయంగా వుండదూ? అయినా ఈవిషయంలో ప్రత్యక్షసంబంధంవున్న సూరిబాబు స్థితి వేరూ, నా స్థితి వేరూను. నేను అతనిగురించి ఆలోచిస్తున్నాను. నాగురించి కాదు. కాని అతను అతన్నిగురించే ఆలోచించుకుంటాడు; ఇది అతని స్వంతవిషయం కనుక. నా నిర్ణయాలకంటె అతని నిర్ణయాలు ముఖ్యమైనవి.

# ఉత్తరం

దూరంగా గేటులోంచి వస్తున్న సూరిబాబుని చూడగానే నా గుండెలు దడదడమన్నాయి. అతను నన్ను గమనించలేదు. అతన్ని పిలవాలని నోటి చివరిదాకా వచ్చిన మాటలు నిలిచిపోతున్నాయి అతను నేరుగా వెళ్ళి సీటులో కూర్చున్నాడు. జేబురుమాలుతో నుదురు ఒత్తుకుని చొక్కా గుండీలు తీసి చొక్కా దోగులు చేసుకుని చెమటకి తడిసిన శరీరంపై గాలి పారజేసుకొంటున్నాడు. నోటితో గుండెలమీద ఊదుకుంటుంటే నేను మెల్లగా అడుగులో అడుగువేసుకుంటూ కిటికీ వారగా నిలబడి 'సూరిబాబూ' అని పిలిచాను.

అతను వెనక్కి తిరిగి నవ్వాడు.

నేనూ పేలవంగా నవ్వాను. తల వూపాను నమ్మన్నట్టుగా.

అతను లేచి ఇవతలికి వచ్చాడు. తోటలోపలికి తీసుకువెళ్ళి కూర్చోబెట్టి తలవంచుకునే అన్నాను "ఒకందుకు నువ్వు నన్ను క్షమించాలి." అని.

అతను కలలుకనే చూపుల్లోంచి తెప్పరిల్లినట్టుగా "ఎవిటండీ?" అన్నాడు అంత కంగారు పడకుండానే.

నేను ఉత్తరం అతనికివ్వబోయి మళ్ళీ వెనక్కి లాక్కుని "ఈ ఉత్తరం ద్వారా ఉత్పన్నమవబోయే సమస్యలో నా అంతట నేను భాగస్వామినైపోయాను అందుకనే నన్ను క్షమించమని కోరుతున్నాను. ఇప్పుడు నేను చెయ్యగలిగిందల్లా నీకు ఒక హామీని ఇవ్వటం మటుకే. ఈ రహస్యం నాలోనే ఉంచుకుంటాను. నా ద్వారా మటుకు ఈ రహస్యాన్ని బయటికి పొక్కనివ్వను" అన్నాను. నేనిలా అంటుంటే అతను కంగారుగా నా చేతిలో ఉత్తరాన్ని లాక్కుని చదవసాగాడు.

అతను ఉత్తరం చదువుతుంటే మారుతున్న అతని ముఖ కవళికలు గమనిస్తూ గుండెలు చిక్కబట్టుకుని ఊపిరి మెల్లగా విడుస్తూ కూర్చున్నాను.

తల వంచుకుని కూర్చున్న నా భుజంమీద అతని చెయ్యిపడటంతో తలఎత్తాను. "నా కంతా అయోమయంగా వుంది." అన్నాడు సూరిబాబు.

అతని ముఖంలోకి నేను చూడలేక పోయాను.

అతను ఆలోచిస్తూ వుండిపోయాడు. వారం రోజుల్నుంచీ అతనిలో తొంగిచూస్తున్న నూతన కాంతులు అతని ముఖంలో ఎర్రజీరలుగా మారటం గమనిస్తూనే ఉన్నాను. అతని పిడికిలిలో నలిగిపోతున్న గడ్డిపరకలు అనుపచ్చని నెత్తురుని కక్కుతున్నాయి. అతని ముక్కుపుటాలు అదరటం చూసిన తర్వాత నేను భయంగా పక్కకి తిరిగి వుండిపోయాను.

అతను సీటులో కూర్చుని ముందు కాగితాలు పరుచుకుని కూడా ఈ విషయమే ఆలోచిస్తున్నాడు కాబోలు-పెదిమలు పళ్ళతో నొక్కుకుంటున్నాడు.

నిత్యం పనిచేసుకుంటూ కూడా బల్లకింద అలవాటుగా వూగే అతని కాళ్ళు ఇప్పుడు కదలకుండా డ్రాయరు కాళ్ళకి అనుకుని నిశ్చలంగా వుండిపోయాయి. మధ్యమధ్య బొటనవేలుతో నేలని గీరుతున్నాడు. అతని ముందువున్న కాగితాలమీద అతని దృష్టి లేదు. కాగితాలు గాలికి టపటపలాడుతున్నాయి.

ఇంతలో విసుగ్గా "ఏమోయ్! పెళ్ళికొడకా" అంటూ వారం రోజులు శెలవు తర్వాత ఆవాళే డ్యూటీకి వచ్చిన పక్క గుమాస్తా టేబిల్ మీద కూర్చున్నాడు.

సూరిబాబు తలయెత్తి చిరునవ్వు నవ్వాడు.

"పెళ్ళి నిశ్చయం అయిందిట. ఎవరూ? ఏమిటి? ... కట్నాలు ... కానుకలు ... ఆస్తిపాస్తులూ ... చెప్పవయ్యా!"

సూరిబాబు నావైపు చూశాడు.

నేనేవిటి చేసేది? బాధపడ్డాను. ఉత్తరం చూసినందుకు మొదటి శిక్ష ఇది అనుకున్నాను.

"అవును పెళ్ళి నిశ్చయం అయింది ముహూర్తం ఇంకో వారం రోజులుంది. మిగతా వివరాలు తర్వాత చెబుతాను." అన్నాడు సూరిబాబు.

సాయంత్రం ఆఫీసులోంచి ఇంటికి బయల్దేరబోయే ముందు సూరిబాబు నాదగ్గరగా వచ్చి "అలా వెళ్దాం వస్తావా?" అన్నాడు.

నేను అతడ్ని అనుసరించాను

ఎక్కడికని ప్రశ్నించకుండా అతని పక్కనే అనుసరించాను. దారి పొడుగూతా మాట్లాడటానికి ఎవరమూ సాహసించలేకపోయాం. ఈ ఉత్తరం ముల్లులా ఇద్దరిలోనూ మెదుల్తూనే వుంది.

"ఈ ఉత్తరం నమ్మవచ్చంటావా?" అన్నాడతను ఉన్నట్టుండి.

ఈ ప్రశ్నకి "'నమ్మను' అని నువ్వు దృఢంగా తోసిపారెయ్యగలవా?" అన్నాను.

అతను మాట్లాడటానికి వ్యవధి తీసుకున్నాడు. "అదే చిక్కుగా వుంది. మేం వాకబు చేసినంతవరకూ ఆమెగురించి ఇలా ఎవరూ చెప్పలేదు. ఈ సంబంధం నిశ్చయం చేసుకోవటంలో మేం ఏమాత్రం తొందరపడలేదు కూడాను."

నేను ఏం చెబుతే ఏం ప్రమాదమో అన్నట్టుగా మాట్లాడటానికి సాహసించలేకపోతున్నాను.

కాలవ మెట్లమీద కూర్చున్నాం.

మెట్లవార దిగువగా కూచుని జాలరి చేపలు పడుతున్నాడు.

"ఈ ఉత్తరం మా నాన్నగారికి చూపించాలా కూడదా అని ఆలోచిస్తున్నా." అన్నాడు సూరిబాబు.

నేను అంత బొంగురుగా మాటలు కంపిస్తూ పోవటం గమనించి "నీ గురించే నువ్వు ఆలోచించుకుని బాధ పడుతున్నట్టున్నావు. నా వాళ్ళీ ఈ ఉత్తరం చూస్తే ఏమనుకుంటాను. నువ్వూ అంతే. ఇప్పుడు మనిద్దరం కలిసి ఈ విషయం ఆలోచించాలి. నువ్వు ఉత్తరం చూశావని నేనేం బాధపడటం లేదు. చూడకుండా వుంటే సంగతి వేరనుకో. అది నేనూ ఒప్పుకుంటాను. కాని జరిగిపోయిందాన్ని గురించి బాధపడి ప్రయోజనం లేదు. జరగవలసిందాన్ని గురించి ఆలోచించాలి. అంతే." అన్నాడు.

నేను చప్పున సిగ్గుపడుతూ "లేదు లేదు." అంటూ నవ్వేసాను.

సూరిబాబు "నువ్వు నీ అంతట అనుకోకుండా ఈ రంగంమీద ఒక పాత్ర వయావుకదూ. నీ సంగతి నాకు బాగా తెలుసు." అన్నాడు మళ్ళీ.

అవి నీ మాటలు నా తృప్తికోసమే అన్నాడని నాకు తెలుసు. అతను పైకి తేలకపోయినా లోలోపల ఎంత గింజుకుంటున్నదీ నేను గ్రహించకపోలేదు.

"మీ తల్లి దండ్రులకి తెలియకపోవటంవల్ల నీ కేమైనా ఉపయోగం వుందా?" అన్నాను.

"వాళ్ళకి తెలుస్తే అసలు స్థితి మరింతగా చెడి పోతుందేమో అని భయంగావుంది." అన్నాడు సూరి బాబు.

నేను అతని ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాను.

"వెంటనే ఈ సంబంధం మానుకున్నామంటూ టెలిగ్రాం ఇచ్చేస్తారు."

నేను ఆశ్చర్యంగా విననాగాను.

"ఒక ఆకాశరామన్న ఉత్తరాన్ని బట్టుకుని నిజం ఏమిటో తేల్చుకోకుండా అలా తొందరపడటం మూర్ఖంగానూ, అనాగరికంగానూ ఉంటుందని నా అభి ప్రాయం."

"పోనీ ఆ ఉత్తరం ఎంతవరకూ నిజమో అక్క డికే వెళ్ళి వాకబుచేస్తే?" అన్నాను.

అతను నవ్వి "ఏమని? 'ఈ పిల్ల మంచిదేనా?' అని కనిపించిన వాళ్ళందర్నీ అడగమంటావా? ఈ విషయంగా మరింత అల్లరి చెయ్యమంటావా? మన వేపు నించే మనం ఆలోచించుకుంటే ఎలా? అవతలవాళ్ళ గురించి కూడా ఆలోచించాలిగా. ఒక వేళ ఆమె నిర్దోషి అయివుంటే ఇంత అల్లరి ఆగం జరిగితే ఆమె ఏమయిపోవాలి? ఇవన్నీ మనం ఆలోచించాలిగా?" అన్నాడు సూరిబాబు.

"అంతకు తప్పించి గత్యంతరం లేదు మరి. సంబం ధం మానుకోవటం తప్పించి." అన్నాను నేను తొందర పడి. వెంటనే అతని ముఖంలోకి చూసి నాలిక కొరు క్కున్నాను. నా ఆఖరి మాటలు అతన్ని చాలా కలచి నట్లుగా అతని ముఖం చూస్తే తెలిసిపోతూనే వుంది.

"కాదు, కాదు. ఆ పని నేను తొందరపడి చెయ్యలేను." అన్నాడు సూరిబాబు తల అడ్డంగా వూపుతూను.

జాలరి చేపలు పడకపోయినా విసుగులేకుండా నీటిలో వలయాలని ఆశగా చూస్తూ కూచుని వున్నాడు. "పోనీ, నేరుగా వెళ్ళి వాళ్ళనే అడిగేస్తే?" అన్నాను. సూరిబాబు నావైపు తిరిగి "ఇది మంచి ఉపాయమే. అలా చేస్తే బాగానే ఉంటుంది." అన్నాడు.

మర్రిచెట్టు రెమ్మలూ, ఊడలూ పాముల్లా కాల వలో పాకుతున్నాయి

"ఇక పోదాం." అన్నాడు సూరిబాబు మర్రి చెట్టు కొమ్మల మధ్యనించి ఆకాశంవైపు చూస్తూను.

ఇద్దరం ఏందుటాకులు చప్పుడు చేసుకుంటూ వీధిమీదకొచ్చాం. వీధివార దీపాలు వెలిగాయి. జనం పల్చగావున్న పందుల వెంబడి నడుస్తున్నాం. "ఒక విషయం నీతో చెప్పాలనుకొన్నా. ఇకముందు నా దగ్గర తప్పించి ఇంకెవరి దగ్గరయినా సరే అసలీ వుత్తరం సంగతే తెలియనట్టుగా నువ్వు మసులుకోవాలి." అన్నాడు సూరిబాబు.

నేను తల వూపాను.

మావీధి మొగలో ఇద్దరం విడిపోయాం.

## 2

రాత్రి భోజనం అయింతర్వాత వరండాలో కూచుని ఈ విషయమే ఆలోచిస్తున్నాను. సూరిబాబు ఆమెని గాఢంగా ప్రేమిస్తున్నాడు గనక ఈ విష యంలో అటూఇటూ తటపటాయిస్తున్నాడని అనుకు నేందుకు వీల్లేదు. అతని స్వభావం నాకు బాగా తెలుసు. ఇక్కడ ప్రేమించటం అనే ప్రసక్తి లేదు. ఆ పిల్లమీద కొన్ని అపవాదులు పుట్టాయి. అవి నిజం కావచ్చు; కాకపోవచ్చు. అది తేల్చుకోకుండా ఏ నిర్ణయం చేసినా అది తొందరపాటు చర్యే అవుతుంది. కనక అసలు నిజం ఏమిటో తెలుసుకుందుకే అతను ఆరాటపడుతున్నాడు.

లోపల పిల్లలు దీపంముందు చదువుకుంటున్నారు. బయట చినుకులు పడుతున్నట్టుగా తోచి కుర్చీ నడత పెట్టుకుని లోపలికి వెళ్ళబోతుంటే ఎవరో దూరంగా పిలిచినట్టయింది. వొంగి చూరుకింద నుంచి తొంగి చూశాను. చీకటిలో గేటుబయట నిలబడ్డ విగ్రహాన్ని పోల్చి 'సూరిబాబూ' అన్నాను.

"ఆఁ! నేనే! గొడుగు తీసుకుని ఓమారు రా." అన్నాడు సూరిబాబు గొంతు పెద్దది చేసి.

నేను తలమీద తుండుకప్పుకుని వెళ్ళి "వానలో బయటికి దేనికి? మా వరండాలో కూర్చుందాం. రారాదూ!" అన్నాను.

"ఆఫీసు, ఇల్లూ అంటే నాకు మహాచిరాకనుకో. వాన రాదులే. అలా పోదాం. బట్టలు వేసుకుని బయల్దేరు." అన్నాడు సూరిబాబు.

పది నిముషాల్లో నేను తయారయి గొడుగు తీసుకుని బయలుదేరా. వాన తుంపర తుంపరగా ఆగి ఆగి పడుతోంది. చెట్లకింద బిచ్చగాళ్ళ కుటుంబాలు వానకి తడుస్తూనే ముడుచుకుపోయి పడుకున్నాయి.

ఉండీ ఉడిగీ ఒకజట్కా, ఓరిక్షా తప్పించి విశాలమైన దీర్ఘమైన ఆ వీధి యావత్తూ నిశ్శబ్దంగా ఒంటరిగా కనిపించింది. చెట్లు గాలికి మందంగా కదులుతున్నాయి.

కొంతదూరం పోయింతర్వాత "నీకు చాలా విషయాలు చెబుదామని వచ్చాను. నిద్ర రావటం లేదు గదా!" అన్నాడు సూరిబాబు.

గొడుగు పక్కకు ఒత్తిగించి "వినటానికి నేను సిద్ధంగా వున్నాను." అన్నాను.

"నాకు నలుగురు అప్పచెల్లెళ్ళు వున్నారు. నీకు తెలుసుగా వాళ్ళంతరూ వివాహాలు చేసుకుని సుఖంగా పిల్లా పాపతో దాంపత్య జీవితం గడుపుతున్నారు. అంటే ఈ తరంలో మేం కొత్తదారి తొక్కామన్న మాట. మాతండ్రి తల్లి ఒకప్పుడు కులవృత్తిలో ఆరితేరి పేరుమోసింది. కాలికి గజ్జెకట్టి చిందులు తొక్కి శరీరం అమ్ముకుని ఆమె కులంలో నలుగురితోపాటుగా బ్రతికింది. మాతండ్రి చిన్నతనంలోనే తల్లిని విడిచి దూరదేశాలు పోయి చదువుకుని ఉద్యోగంలో చేరాడు." సూరిబాబు ఏదో ఆలోచన వచ్చినట్టుగా ఆగిపోయాడు.

అతను చాలా లోతుగా మాట్లాడుతున్నాడు. నేను శ్రద్ధగా ఉత్కంఠతో వింటున్నాను.

"కందుకూరి లాంటి మహాపురుషులు సంఘం మీద - ఇంకా వ్యక్తి సన్నిహితంగా చెప్పాలంటే అవసరమైన మార్పుని అంగీకరించని సంఘం మీద దాడిచేస్తున్న రోజులు. ఆయన ఉపన్యాసాలు జనానికి హేతుబద్ధంగా ఆలోచించటం నేర్పుతున్నాయి. ఉత్తేజపరుస్తున్నాయి. వేశ్యావృత్తిమీద ఆయన తీవ్రనిరసన వ్యక్తంచేశాడు. ఆవేదన చెందాడు. 'కందుకూరి' మారమంటున్నాడు. మారాలని అనుకునే వాళ్ళమీద సంఘం ధ్వజం ఎత్తితే రక్షణ ఇచ్చాడు. బాధలు పడ్డాడు బాధపడేవారికోసరం. మనిషి మనిషికి మంచి చెప్పాడు. ఇంతమందికోసం బ్రతికాడు. అలాంటి మహాపురుషుల త్యాగమూ, సేవా వృథాగా పోవు. సంఘం స్వరూపం మారుతూ వచ్చింది. మా నాన్నగారు ఈ వాదోపవాదాలన్నీ జీర్ణంచేసుకున్నాడు. మంచి మాటలు విని మననం చేసుకున్నాడు. సిగ్గుపడ్డాడు. ఆ సంస్కారం ఆయనలో పుంజుకుంది. వివాహం చేసుకున్నాడు. మా అప్పచెల్లెళ్ళందరికీ మంచి మంచి సంబంధాలే చేశాడు. తన పిల్లలంతా ఉత్తమ సంప్రదాయాలతో సహృదయులై సంస్కారులై జీవించాలని ఆశించాడు. ఈ మార్పు అనేది మా కులములో నిప్పులా అందరి హృదయాలలోనూ రాజుకొంది. ఎన్నో సంబంధాలు చూసి చూసి ఈ సంబంధం నిశ్చయం చేసుకొంటే ఇది ఇలా తారుమారయితే ఈ విషయం నాన్నగారికి తెలిస్తే ఆయన చాలా నిస్పృహ చెందుతారు."

"అయితే ఈ ఉత్తరంసంగతి మీ నాన్నగారికి తెలియదా?" అన్నాను ఆశ్చర్యంగా.

'లేదు. ఇకముందూ చెప్పదల్చుకోలేదు." అన్నాడు సూరిబాబు.

మేం వెనక్కి మళ్లాం. వాన పూర్తిగా తగ్గిపోయింది. జివ్వుమంటూంది వాతావరణం.

వినటంవరకే నావంతు. ఏమని మాట్లాడగలను? అయితే అతను చెప్పిన విషయాలు నాలో మెదుల్తూనే ఉన్నాయి. ఆలోచిస్తూనే వున్నాను. ఆలోచిస్తున్న కొద్దీ కొత్త కొత్తసత్యాలు బయటపడుతూనే వున్నాయి. నేను ఒకే ఒక్క అభిప్రాయం వెలిబుచ్చాను: "నీలో సంఘర్షణ నాకు పూర్తిగా అర్థం అయింది. నీపట్ల నాకు పూర్తిసానుభూతి ఉంది భాయీ!" అన్నాను.

## 3

ఆమొర్నాడు సూరిబాబు ఆఫీసుకు రాలేదు. శెలవుచీటీ పంపించాడు. రెండురోజులు శెలవు పెట్టాడు. మూడోరోజు ఆదివారం అయింది. సాటి ఉద్యోగులు గుసగుసలు పోయారు. పెళ్లికిముందే ఉన్న శెలవంతా వాడుకుంటే పెళ్ళయింతర్వాత శెలవు కావాలంటే ఎక్కడ్నించి వస్తుందంటూ ఆఫీసరు విసిగాడు.

ఒగంట పోయింతర్వాత సూరిబాబు దగ్గర్నించి ఒకుర్రవాడు చీటీతో వచ్చాడు. సాయంత్రం వూరు వెళ్తున్నాననీ స్టేషన్లో కలుసుకోవలసిందని చీటీలో రాశాడు.

సాయంత్రం స్టేషనుకి వెళ్ళాను. అప్పటికే బండి వచ్చి సిద్ధంగా వుంది. నేను ప్లాట్ ఫారం మీదకు రాగానే బండిలోంచి సూరిబాబు కిందకు దిగి నన్ను పిలిచాడు. నేను దగ్గరకి వెళ్ళేటప్పటికే గార్డు విజిలు వేశాడు. సూరిబాబు ఆదరాబాదరాగా జేబులోంచి శెలవుకాగితం ఒకటితీసి "సోమవారం కూడా నేను రావటం పడకపోతే ఈ శెలవుచీటీ ఆఫీసులో ఇచ్చెయ్యి" అన్నాడు.

"ఇవ్వాళ రేపూ శెలవు పెట్టినందుకే ఆయన గొణుక్కున్నాడు" అన్నాను.

"ఫర్వాలేదు గత్యంతరం లేదుమరి." అంటూ అతను బండిఎక్కి "నేను అక్కడికే వెళ్తాను. ఆఫీసరుతో కాస్త నువ్వు చెప్పిపనిజరిగేటు చూడు." అన్నాడు.

బండి కదిలింది. నేను ఇంటికి వచ్చేశాను

ఆ మూడురోజులూ అతనికోసం ఆతురతతో ఎదురుచూశాను.

* * *

ఆదివారం సాయంత్రం ఒకుర్రవాడు మాయింటికి వచ్చాడు. నేను అప్పుడే ఇంట్లోంచి బయల్దేరబోతున్నాను. అతను ఎదురువచ్చి ఓచీటీ అందించాడు. సూరిబాబు కాలవగట్టు దగ్గరకి రమ్మనమని రాశాడు. మర్రిచెట్టు నీడలో మెట్లమీద కూర్చుని చేపలు పడుతూన్న జాలరితో కబుర్లు చెబుతున్నాడు సూరిబాబు. నన్ను చూడగానే చప్పున ఇటుతిరిగి నీకోసమే ఎదురుచూస్తున్నా." అన్నాడు.

అతనిపక్కగా కూర్చుని 'ఏమయింది ?" అన్నాను ఓపికపట్టలేక.

"కూచో కూచో. అదంతా పెద్దగాథ "అన్నాడు నాకు చోటుయిస్తూను.

"ఆ ఉత్తరంలోని ఒక్కవిషయం కూడా నిజం కాదు. అన్నీ అబద్ధాలు. ఈ ఒక్కవిషయం చెబుతే నీకుచాలా ?" అన్నాడు సూరిబాబు ఉల్లాసంగా.

"అలా ఒక్కముక్కలో తేల్చేస్తే ఎలా నాటకరంగంలో నేనూ ఒక పాత్రనయినప్పుడు!" అన్నాను.

" అయితే విను. "

నేను ఉత్సాహంగా ముందుకు జరిగాను. కాలవగట్టున పండుటాకులు గాలిలో కొట్టుకొంటూ నేల రాలుతున్నాయి. "పశుప్రవృత్తి చేసుకుని బ్రతికిన ఒకకులంలో ఒకపిల్ల నీతిగా బ్రతకాలనుకుంటే చూసి ఓర్వలేని వాళ్ళు, బాసలు పెట్టేవాళ్ళూ కొందరుంటారు. కొంతమంది చాటుగా హేళనగా నవ్వుకుంటారు. మరికొంతమంది మరీ బరితెగించి అనాగరికంగా ప్రవర్తిసారు. వాళ్ళ సుఖంకోసమే ఈకులం ఏర్పడిందని వాళ్ళ ఉద్దేశం. అలాంటి మహానుభావుడొకడు ఈ అమ్మాయిని వేధించి, బ్రతిమాలి, భయపెట్టీకూడా లొంగదీసుకోలేక ఈపని చేశాడు. పెళ్ళికొడుకుని నేనని తెలియని ఒక పరిస్థితిలో ఆ పెద్దమనిషే నాతో ఏవేవో కూశాడు. వాడు కూసినవన్నీ నా నోటితో నేను చెప్పలేను." అంటూ నిట్టూర్చాడు సూరిబాబు.

నేను నివ్వెరబోయాను.

జాలరివాడు బుట్ట చంకని తగిలించుకుని సూరిబాబు దగ్గర శెలవుతీసుకుని వెళ్ళిపోయాడు.

"ఈ కులం సంగతి నీకు బాగా తెలియదు భాయీ ! అపవాదు పుట్టకుండా వుండాలిగాని పుడితే మాపుకోవటం చాలా కష్టం. ఎంత నీతిగా వున్నా అపవాదు తప్పదు. అది అబద్ధం అని రుజువు చేసుకోవటం మరీ కష్టం. తాటిచెట్టుకింద పాలు తాగటంలాంటిది." అన్నాడు సూరిబాబు నుదురు వత్తుకుంటూను.

'మారే మనుష్యుల్ని చూసి మారని మనుష్యులు ఇలాగే భావిస్తారు కాబోలు' అనుకున్నాను మనసులో జరిగిందంతా పునరావృతం చేసుకుంటూను. అయితే నాలో ఒక సందేహం ఉండిపోయింది.

"ఈ ఉత్తరం సంగతి నీ తల్లిదండ్రులతో ఎందుకు సంప్రదించలేదు. ఎందుకు దాచావు?"అన్నాను.

"మా బంధువుల్లోనే ఇలాంటి సంఘటనే ఒకటి జరిగింది. అయితే ఆ ఉత్తరాన్ని బట్టుకుని వెళ్ళి వాకబు చేస్తే నిజంగా ఆ పిల అలాంటిదే అయింది. ఆ సంబంధం వదులుకున్నారు. పిలవాడి తరఫున వాకబు చెయ్యటానికి వెళ్ళిన వాళ్ళలో మా నాన్నగారుకూడా వున్నారు ఆ ఉదంతం మా నాన్న ఇంకా మర్చిపోలేదు. ఇలాంటి గొడవంటే ఆయనకు మహా చికాకు."

నాకు అంతా అర్థం అయింది.

"నీకు యింకో విషయం చెప్పాలి. ఈ రహస్యం నాకూ, ఆ పిల్లకీ, ఆ ఉత్తరం రాసినవాడికీ నీకూ తప్పించి మరెవరికీ తెలియదు." అన్నాడు సూరిబాబు ఉన్నట్టుండి

నేను ఆతురతగా "ఆ పిల్ల తల్లిదండ్రులకి కూడా తెలియకుండా..."

అర్థాంతరంగా అందుకుని "నేను నేరుగా ఈ విషయం ఆ పిల్లతోనే చర్చించాను." అన్నాడు సూరిబాబు.

నేను మనసులో అతని మెలకువకి అభినందించకుండా వుండలేకపోయాను.

మళ్ళీ సూరిబాబే "కాని ఆమెదగ్గర ఒక అబద్ధం మటుకు ఆడాను " అన్నాడు.

"ఓ· ఏవిటి. ఇలాంటి సందర్భాలలో ప్రమాదంలేని ఎన్ని అబద్ధాలయినా ఆడవచ్చు" అన్నాను నవ్వుతూను.

అతను మటుకు నవ్వకుండానే "ఈ రహస్యం మీకూ నాకూ ఆ పిచ్చివాడికీ తప్పించి మరెవరికీ తెలియదని హామీ యిస్తారా? ప్రమాణంచేసి చెప్పగలరా? అని ఆమె అడిగింది." అన్నాడు.

నా ముఖం సిగ్గుతో ముడుచుకుపోయింది.

అతను గ్రహించి "లేదు. ఈ రహస్యం ఎవరికీ తెలియదు - అని ఆమెకు ప్రమాణ పూర్వకంగా చెప్పాను." అన్నాడు.

అప్పటికీ నేను కోలుకోలేకపోయాను.

సూరిబాబు నా చెయ్యి అతని చేతిలోకి తీసుకుని "నా పెళ్ళికి నువ్వు తప్పకుండా రావాలి. వస్తానని ప్రమాణంచెయ్యి." అన్నాడు.